క్లుప్తంగా

కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మొబైల్ ఫోన్ అతిగా వినియోగించడం వల్ల కంటి చూపు దెబ్బతింటుందని నేత్ర వైద్య నిపుణులు ఇండ్ల స్వప్న అన్నారు. మంగళవారం బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కంటి వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. అతిగా మొబైల్ ఫోన్ వాడటం వల్ల కంటికి జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. క్రమబద్ధమైన జీవన విధానం, ఆరోగ్యకరమైన ఆహారం, కంటి చూపునకు సంబంధించిన క్రమశిక్షణ మొదలగు అంశాలను విద్యార్థులకు వివరించారు. వేసవి సెలవుల్లో టీవీ, మొబైల్ చూడకుండా ఆరుబయట మైదానంలో ఆటలు ఆడుకోవాలని సూచించారు. ఇంట్లో చేయగలిగే ఆర్ట్స్, క్రాఫ్ట్, చెస్ వంటి ఆటలు ఆడటం మంచిదన్నారు. పుస్తకాలు చదివితే విజ్ఞానంతో పాటు కంటికి మంచి వ్యాయామం అవుతుందన్నారు. గ్రంథాలయ అధికారి కె. రమాదేవి పాల్గొన్నారు.

రంజింపజేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో అనంతపురం జిల్లా కదిరికి చెందిన సంజయ్ నాట్య కళాక్షేత్రం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను రంజింపజేసింది. మంగళవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై వీరు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

బాబా మందిరంలో అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం ఆలయకమిటీ ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ అర్చకులు బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు శ్రీలక్ష్మీ వసుంధర భరత నాట్యం అరంగేట్రం



భవానీపురం(విజయవాడపశ్చిమ): దక్షిణ భారత దేశంలో నాట్య శాస్త్రం రచించిన భరతముని పేరుతో పుట్టి ప్రసిద్ధి గాంచిన ఒక శాస్త్రీయ నృత్య విధానం భరత నాట్యం. పురాతన దేవాలయాలలో శిల్పాలు భరత నాట్య భంగిమలలో అప్సరసలు నాట్యం చేస్తున్నట్లుగా తీర్చిదిద్దబడి ఉండటం అందరికి తెలిసిందే. అటువంటి అద్భుత భరత నాట్యంలో గన్నవరానికి చెందిన చిన్నారి శ్రీలక్ష్మీ వసుంధర వల్లభనేని బుధవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తన భరత నాట్య ప్రదర్శనతో అరంగేట్రం చేస్తోంది. గన్నవరం శాసనసభ్యుడు వల్లభనేని వంశీ – డాక్టర్ పంకజశ్రీ తనయ శ్రీలక్ష్మీ వసుంధర. తల్లి డాక్టర్ పంకజశ్రీ ప్రోత్సాహంతో ఈ చిన్నారి తన 6వ ఏట నుంచే శ్రీనృత్య ఆర్ట్ అకాడమీకి చెందిన ప్రముఖ నాట్యాచారిణి డాక్టర్ భాగవతుల సౌమ్య వద్ద భరత నాట్యంలో శిక్షణ తీసుకుంది. ఈ అరంగేట్రంలో భరతనాట్యంలోని పలు అంశాలకు శ్రీలక్ష్మీ వసుంధర వల్లభనేని నర్తించనుంది.

గణపతి పూజతో దీక్ష విరమణలకు అంకురార్పణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో మంగళవారం దీక్ష విరమణ మహోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపనను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. పూజా కార్యక్రమాలను పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షించారు. బుధవారం నుంచి అభయ వీరాంజనేయ స్వామి వారికి అభిషేకాలు, అర్చన, తమలపాకులతో పూజ జరుగుతుందని దుర్గాప్రసాద్ స్వామిజీ పేర్కొన్నారు.

ఆంజనేయం మహావీరం

- కోరిన కోర్కెలు తీర్చే మాచవరం దాసాంజనేయస్వామి
- శ్రీవ్యాసతీర్థ యతీంద్రులతో ప్రతిష్ట కావించబడిన పుణ్యక్షేత్రం
- 30వ తేదీ నుంచి హనుమజ్జయంతి వేడుకలు



స్వయం భూ దాసాంజనేయ స్వామివారి దేవాలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పవిత్ర కృష్ణానదీ తీరాన విజయవాడ మాచవరం క్షేత్రమున స్వయంగా వెలసి, శ్రీవ్యాసతీర్థ యతీంద్రులచే ప్రతిష్ట కావించబడిన పవిత్ర పుణ్యక్షేత్రం మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం .'ఆంజనేయం మహావీరం' అంటూ నిత్యం వేలాది భక్తులతో పూజలు అందుకుంటున్న ఈ దేవాలయంలో భక్తితో పూజిస్తే సకల కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అలాగే ఇక్కడ ఆలయంలో ప్రదక్షిణలు చేయడం ద్వారా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడంతో పాటు కష్టాలు తీరుతాయని భక్తుల నమ్మకం.

ఆలయ చరిత్ర..

శ్రీవ్యాసతీర్థులు వారి శిష్యగణంతో పాదయాత్ర చేస్తూ ఒకనాటి రాత్రి ఇంద్రకీలాద్రిపై విశ్రమిస్తుండగా మారుతి ఒక వానర రూపమున వచ్చి వ్యాసతీర్థుల వారిని తట్టి లేపి తనను అనుసరించమని సైగ చేసింది. దీంతో వారందరును మారుతీని అనుసరించి తూర్పు దిశగా గుట్టలు, పుట్టలు దాటుకొని వచ్చి ప్రస్తుతం మాచవరం దేవస్థానంగా వ్యవహరించబడుచున్న ప్రదేశమునకు వచ్చి తనకు ఆలయంను నిర్మించమని చెప్పారు. అలాగే విగ్రహమునకు ఇరు వైపుల వైష్ణవ చిహ్నం శంకు, చక్రములను చిత్రించమని కాలక్రమమున ఇది గొప్ప దివ్య క్షేత్రం అగునని చెప్పి అక్కడ నుంచి శ్రీరామ, శ్రీరామ, శ్రీరామ అనుచు ఉత్తర దిశకు తిరిగి చేతులు జోడించి అదృశ్యమైనారు. శ్రీస్వామివారి ఆదేశానుసారం దేవస్థానం నిర్మించడం జరిగింది. కాలాంతరమున విజయనగర సామ్రాజ్యం శత్రురాజుల పరాధీనమైంది. కొన్ని ఆలయాలు శిథిలమైపోయినవి. తిరిగి సుమారు 150 సంవత్సరాల క్రితం నూతనంగా ఏలూరు–విజయవాడ రోడ్డు మార్గమును నిర్మిస్తుండగా అప్పటి రోడ్డు కాంట్రాక్టర్ దున్నా వీరస్వామి నాయుడుకు స్వామివారు స్వప్నంలో కనిపించి తన ఉనికి తెలియజేసి బహిర్గతం చేయమని ఆదేశించారు. మరునాడు కూలీలతో స్వామివారు చెప్పిన గుర్తుల ప్రకారం తవ్వించి చూడగా శ్రీస్వామివారి దివ్య మంగళ విగ్రహం సిందూరపు పూతతో బహిర్గతం అయ్యింది. అప్పటికప్పుడు చిన్న పందిరి నిర్మించి భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణంకు ముందు నుంచి ఒక రావి చెట్టు స్వామివారికి చల్లని పచ్చదనం కల్పించు చున్నది. ఇది ఇప్పటికీ ఉంది. స్వామివారి స్థల పురాణం పెద్దల నుంచి అనుశ్రుతముగా చెప్పబడినదే కానీ ప్రామాణికంగా ఎటువంటి శిలాశాసనాలు లేవు. ఇక్కడ స్వామివారికి విశేషంగా సిందూరం, ఆకు పూజలు నిర్వహిస్తారు. భక్తులు, దాతల సహకారంతో లక్ష తమలపాకుల పూజలు జరుగుతాయి. ఇక్కడ వాహన పూజలు చేయించుకోవడం ప్రత్యేక విశేషం. ఎవరు కొత్తగా ఏ వాహనం కొనుగోలు చేసినా ఇక్కడ పూజలు చేయించుకోవడం ఆనవాయితీగా మారింది. ముఖ్యంగా దసరా, ప్రత్యేక పర్వదినాల్లో వందలాది వాహనాలు పూజల కోసం బారులుతీరుతాయి.

కష్టాలు తీరి కోరికలు నెరవేరుతాయి



ఇక్కడ దాసాంజనేయస్వామి వారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరి కోరిన కోరికలు నెరవేరుతాయి. భక్తులు, దాతల సహకారంతో ఆలయం దిన దిన ప్రవర్ధమానంగా వెలుగొందుతూ ఉంది. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఇక్కడకు వచ్చి పూజలు చేయించుకుంటారు.

– గోవర్ధనం శోభనాద్రీచార్యులు, ఆలయ అర్చకులు

కూచిపూడి నృత్యరీతులు విశిష్టమైనవి



భాగవతుల వెంకట్రామశర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కూచిపూడి సంప్రదాయ నృత్యరీతులు విశిష్టమైనవని నాట్యాచార్యుడు భాగవతుల వేంకట్రామ శర్మ అన్నారు. నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, ప్రతిభ కనపరచిన నృత్య కళాకారులకు తాండవ కృష్ణ, లాస్య కృష్ణ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రామ శర్మ మాట్లాడుతూ కూచిపూడి గ్రామంలో జీవం పోసుకున్న కూచిపూడి నృత్యాన్ని నేడు ప్రపంచం గమనిస్తోందన్నారు. నాట్యాచార్యుడు ఘంటసాల పవన్‌కుమార్ మాట్లాడుతూ నాట్యం జీవన వేదంగా అభివర్ణించారు. నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయ వ్యవస్థాపకుడు త్రినాథచారి సంస్థ లక్ష్యాలను వివరించారు. నాట్యాచార్యుడు సప్త శివకుమార్, ఆధ్యాత్మికవేత్త సాయిరాం మహారాజ్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. 13వ వార్షికోత్సవం సందర్భంగా నాట్యాచార్యుడు భాగవతుల వెంకట్రామ శర్మను వివిధ రంగాలకు చెందిన గంగాధర్, వినయ్, నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన చిన్నారులకు తాండవ కృష్ణ, లాస్య సుందరి పురస్కారాలను, జ్ఞాపికలను అందజేశారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం



విద్యార్థులకు తెలుగు పద్యాలు నేర్పిస్తున్న రిటైర్డ్ లెక్చరర్ సావిత్రి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): జిల్లా గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, నీతి కథలు చదవడంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, టీచర్‌లు, లెక్చరర్‌లు స్వచ్ఛందంగా పాల్గొని పలు అంశాల్లో విద్యార్థులకు శిక్షణ అందించారు. రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ టి.సుబ్బన్న గణిత శాస్త్రంలో శిక్షణ అందించారు. రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి విద్యార్థులకు యోగా, ధ్యానం, తెలుగు పద్యాలు, శ్లోకాల్లో శిక్షణనిచ్చారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం రిటైర్డ్ టీచర్ అనురాధ విద్యార్థులకు జాతీయ గీతాలు, పద్యాలలో శిక్షణతో పాటు వాటి భావాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో పాల్గొని పాఠ్యంశాలు, జాతీయ నాయకుల చరిత్రలు, దేశభక్తి తదితర విషయాలపై విద్యార్థులకు బోధిస్తున్న విశ్రాంత అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. జాతీయ గీతాలు పౌరుల్లో దేశభక్తి, ధైర్యం, జాతీయ భావాన్ని ప్రేరేపిస్తాయని అన్నారు. ఇది దేశం పట్ల గౌరవం, ఐక్యత, సామరస్య సందేశాన్ని వ్యాప్తి చేయడానికి ఒక మార్గమని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయంలో నిర్వహించిన చెస్, క్యారమ్స్ ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

దాతల సేవలు అపూర్వం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుమారు 41 రోజులుగా నిర్విరామంగా దాహార్తులకు మజ్జిగ పంపిణీ చేయడంలో సహకరించిన దాతల సేవలు నిరుపమానం అని వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ బీ వసంతకుమార్ కొనియాడారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులో బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండే వేసవి ఎండల్లో 41 రోజులుగా దాతల సహకారంతో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవలు అందించాలని సూచించారు. అనంతరం దాహార్తులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, ఎక్స్ రే సాంస్కృతిక సాహిత్య సేవాసంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లూరి, బోడి ఆంజనేయరాజు, కోరంగి నాగమల్లేశ్వరి, ఎస్‌కే షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఖుద్దూస్‌నగర్‌లో పోలీసుల తనిఖీలు



ఖుద్దూస్‌నగర్‌లో నివాసితుల వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్ఎన్ పురం పోలీసులు పలు సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎస్ఎన్‌పురం సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున ఖుద్దూస్‌నగర్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పోలీస్ సిబ్బంది పలు బృందాలుగా ప్రతీ నివాసాన్ని క్షుణంగా తనిఖీ చేశారు. నివాసం ఉంటున్న వారి వివరాలు, గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా పలు వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. సాయంత్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు హోటల్స్, లాడ్జీలను తనిఖీ చేసి బసచేసిన వారి గుర్తింపు కార్డులను పరిశీలించారు. నగరంలో అనుమానస్పద వ్యక్తులు, సరైన గుర్తింపు కార్డులు లేని వ్యక్తులకు రూమ్స్ ఇవ్వరాదని సీఐ హోటల్స్ నిర్వాహకులకు సూచించారు.

చనిపోయింది డయేరియాతో కాదు



వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): మొగల్రాజపురంలో ఓ వ్యక్తి డయేరియాతో చనిపోయాడని, అందుకు వీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీరే కారణమని నగరంలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డయేరియా ప్రబలిందని ప్రచారం జరుగుతున్న ఈ ప్రాంతాల్లో తాము పర్యటించి పూర్తిస్థాయిలో పరిశీలించామని ఈ ప్రాంతంలో 16 శాంపిల్స్ తీసుకుని పరీక్షించామని, తమ శాంపిల్స్‌లో తాగునీటిలో క్లోరిన్ శాతం సరిపడినంతే ఉందని, అయినా మరికొన్ని శాంపిల్స్ గుంటూరుకు పంపామని తెలిపారు. ఈ ప్రాంతంలో చనిపోయిన వ్యక్తి ఎపిలెప్సీ(మూర్ఛవ్యాధి)తో బాధపడుతున్నాడని, చనిపోయిన రోజు మృతునికి నాలుగు విరేచనాలు అయి తగ్గాయని, డయేరియా ప్రబలితే సంబంధిత వ్యక్తికి విరామం లేకుండా వాంతులు, విరేచనాలు అవుతాయన్నారు. మృతుడి మెడికల్ రిపోర్టులు కూడా పరిశీలించామని మృతుడు చనిపోయింది డయేరియా వల్ల కాదని స్పష్టం చేశారు. నగర పౌరుల ఆరోగ్య భద్రతపై తాము పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని, సీజన్ మారుతున్న నేపథ్యంలో నగరవాసులు కూడా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ఆయన సూచించారు.

రాగలహరి కల్చరల్ సంస్థకు నూతన కార్యవర్గం

విజయవాడ కల్చరల్: రాగలహరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్‌కు నూతన కార్యవర్గాన్ని మంగళవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి పీ అయ్యప్పన్ సాయికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ అధ్యక్షురాలిగా ప్రసూనా రామన్, అధ్యక్షురాలుగా బీ లక్ష్మీకాంతం(స్వాతి), కోశాధికారిగా మీరాకుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆర్‌వీ సూర్యారావు, చింతకాలయ చిట్టిబాబు, వీ సూర్యకామేశ్వరిని ఎన్నుకున్నట్లు తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి, నాటక రంగానికి, సంగీత సాహిత్యాల అభివృద్ధికి సభ్యులు కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు.

తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్, వైఎస్సార్‌లకు సుస్థిర స్థానం



కేశినేని భవన్‌లో ఎన్టీఆర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: దివంగత ముఖ్యమంత్రులు ఎన్.టి.రామారావు, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారని రాజకీయ విశ్లేషకుడు లింగమనేని శివరామప్రసాద్ అన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోగుల రమణ, గద్దల యేసురత్నం, గండూరి మహేష్, షేక్ అమానుల్లా, యనమద్ది నాగమల్లేశ్వరరావు, దూది బ్రాహ్మయ్య, అద్దేపల్లి శివ, యూనుస్, సత్యాల దుర్గారావు, ఫయాజ్, ఇస్మాయిల్, శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎన్టీఆర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శివరామప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్, వైఎస్సార్ హయాంలోనే రాష్ట్రంలోని పేద ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించారని గుర్తు చేశారు.

ప్రశాంత వాతావరణంలో చిచ్చుపెట్టవద్దు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న తమ ప్రాంతంలో పచ్చ పత్రిక చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తోందని వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్, ఆ పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఒగ్గు గవాస్కర్ అన్నారు. స్థానిక 32వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'వైకాపా దాడులతో జనం పరుగులు' శీర్షికన వైఎస్సార్ సీపీలో రెండు వర్గాల మధ్య గొడవలు జరిగాయని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారంటూ తప్పుడు కథనం ప్రచురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడవలు జరగకుండానే జరిగినట్లు పచ్చపత్రిక వండి వార్చిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల గౌరవానికి భంగం వాటిల్లే విధంగా ప్రచురించిన పచ్చపత్రిక తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము న్యాయపరంగా ముందుకు వెళతామని స్పష్టం చేశారు. అనంతరం సదరు పత్రిక (ఈనాడు) ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వీరంకి నాగు, లక్ష్మారెడ్డి, గుడిసే శ్యామ్, బత్తుల సుబ్బారావు, మూర్తి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన బస్సులు, స్నానఘాట్లలో ఈఓ తనిఖీలు



దుర్గాఘాట్‌ను పరిశీలిస్తున్న ఈఓ రామరావు, ఈఈ రమాదేవి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన బస్సులు, దుర్గాఘాట్‌లోని స్నానఘాట్లలో ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయవాడ బస్టాండ్ నుంచి దుర్గగుడికి నడిపే బస్సు మంగళవారం సాయంత్రం దుర్గాఘాట్ వద్దకు చేరుకుంది. అదే సమయంలో అక్కడికి విచ్చేసిన ఈఓ రామరావు బస్సులోకి ఎక్కి యాత్రికుల వద్ద టికెట్లను తనిఖీ చేశారు. బస్సు కండక్టర్ నాగేశ్వరరావును టికెట్లకు సరిపడా డబ్బులు ఉన్నాయా.. అదనంగా ఉన్నాయా అని ఆరా తీశారు. అయితే టికెట్లకు సరిపడా డబ్బులు మాత్రమే ఉన్నట్లు చెప్పడంతో బస్సు ఎక్కిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టికెట్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం దుర్గాఘాట్‌లోకి చేరుకున్న ఈఓ అక్కడి దుకాణాలను పరిశీలించారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు నిర్మించిన షెడ్లు తాళాలు వేసి ఉండటంపై ఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుస్తులు మార్చుకునే గదులకు తాళాలు వేస్తే మహిళా భక్తులు దుస్తులు ఎక్కడ మార్చుకుంటారంటూ ప్రశ్నించి వెంటనే తాళాలు తీయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం దుర్గాఘాట్ ఎదుట ఉన్న కేశ ఖండనశాలకు వెళ్లి అక్కడి భక్తులు, నాయీబ్రాహ్మణులతో మాట్లాడారు. ఈఓ వెంట ఈఈ లింగం రమాదేవి, ఏఈ సునీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనోహరం.. అన్నమయ్య పద సంకీర్తనం



నారాయణ తీర్థుల తరంగాలను ఆవిష్కరిస్తున్న మాగంటి వేణుగోపాల్, మల్లాది సూరిబాబు తదితరులు

విజయవాడకల్చరల్: శ్రీ వేంకటేశ్వర సంకీర్తనా అకాడమీ(శ్వాస), కంచి కామకోటి పీఠస్థ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని 616వ జయంతి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమాలు శృతిలయ నివాస్ విద్యార్థుల బృంద గానంతో ప్రారంభమయ్యాయి. యువ సంగీత విద్వాంసురాలు సాత్వికా మోహన్, ఆకాశవాణి నిలయ విద్వాంసులు విష్ణుభొట్ల సరస్వతి, విష్ణుభొట్ల కృష్ణవేణి, మల్లాది సూరిబాబు మధురంగా అన్నమయ్య కీర్తనలను గానం చేశారు. కార్యక్రమంలో భాగంగా మల్లాది సూరిబాబు రచించిన నారాయణ తీర్థుల తరంగాలు సంగీత గ్రంథాన్ని లబ్బీపేట వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ మాగంటి గోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ తరంగాలు భక్తిభావ వీచికలుగా అభివర్ణించారు. సంగీత విద్వాంసుడు గౌరీనాథ్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు చెందిన నారాయణ తీర్థులు రాసిన తరంగాలు నేటికీ నిత్య నూతనంగా విలసిల్లుతున్నాయన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో మల్లాది శ్రీ రాం ప్రసాద్, రవికుమార్‌తో పాటు పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ఆలయ అర్చకులు సిందూరం, ఆకు పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

• ఎల్ఈడీ కాంతుల్లో.. మట్టి కుండల మెరుపులు





ఎండా కాలం నేపథ్యంలో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వీటిని జోరుగా విక్రయిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ప్రజలు వీటిని కొనుగోలు చేయడానికి వెళ్లినవేళ.. ఫుట్‌పాత్‌లపై పెట్టిన కుండలు ఎల్ఈడీ కాంతుల్లో మెరుస్తూ కనిపించడంతో 'సాక్షి' క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ